సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 10 । జూన్ । 2025



మళ్లీ.. మళ్లీ కలెక్టరేట్‌కే.. 8లో

సమస్యలు పరిష్కారం కాక.. అర్జీదారులు పదే పదే కలెక్టరేట్ మెట్లు ఎక్కాల్సివస్తోంది. అధికారుల తీరుపై నిరసన వ్యక్తమవుతోంది.

ఉష్ణోగ్రతలు

సోమవారం

		గరిష్టం/కనిష్టం
అనకాపల్లి	:	36.6/26.8
చోడవరం	:	39.7/27.9



అప్పన్న సన్నిధిలో ఆర్బీఐ ఈడీ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని రిజర్వ్‌బ్యాంక్ ఇండియా ఈడీ రాధాశ్యామ్ రాథో దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు



కలెక్టరేట్ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

తుమ్మపాల: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలు వినియోగించడం ఎంతో ఆరోగ్యకరమని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఆమె సోమవారం ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ఆ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి, ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివాసీల ధర్నా



తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కృష్ణంపాలెం ఆదివాసీలు

మాడుగుల రూరల్ : శంకరం పంచాయతీ శివారు కృష్ణంపాలెం గ్రామానికి సంబంధించి ప్రభుత్వ బంజరు భూములను స్థానిక ఆదివాసీలకు కేటాయించాలని కోరుతూ సోమవారం ర్యాలీ నిర్వహించారు. మాడుగుల గాంధీ పార్కు నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీల సమస్యలు గురించి నినాదాలు చేశారు. తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం తహసీల్దారు రమాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. శంకరం పంచాయతీ శివారు కృష్ణంపాలెం గ్రామంలో గల సర్వే నెంబరు 188-3లో గల భూమిని ఆదివాసీలకు కేటాయించాలని, సివిల్ కేసులలో ఆదివాసీలను ప్రతిసారి పోలీసుస్టేషన్‌కు పిలిపించి పోలీసులు తమని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తహసీల్దారుకు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తహసీల్దార్ రమాదేవి మాట్లాడుతూ ఎస్‌ఐ, ఇతర సిబ్బందితో మాట్లాడుతానని వారికి హామీ ఇచ్చారు. అలాగే కృష్ణంపాలెం గ్రామానికి చెందిన 46 మంది వ్యక్తిగతంగా దరఖాస్తులు అందజేశారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.గణేష్ పాల్గొన్నారు.

గ్రామీణ మెరుపులు

- ఈఏపీసెట్‌లో ర్యాంకులు



లీలా గణేష్‌కు అధ్యాపకుల అభినందనలు



గొల్లు లహరి

నర్సీపట్నం: కోటవురట్ల మండలం కె.వెంకటాపురానికి చెందిన గొల్లు లహరి వ్యవసాయ ఫార్మసీ విభాగంలో 155వ ర్యాంకు సాధించింది. తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా రోలుగుంట మండలం కొవ్వూరులో పని చేస్తున్నారు. తల్లి ఉమ గృహిణి. లహరి మంచి ర్యాంకు సాధించటం పట్ల తల్లిదండ్రులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు. లహరి సాక్షితో మాట్లాడుతూ త్వరలో వెలువడే నీట్ ఫలితాల్లో మంచి ర్యాంకు వస్తుందన్న నమ్మకం ఉందన్నారు. మెడిసిన్ చేయాలనేది తన సంకల్పమని, ఎంబీబీఎస్ చేసి కార్డియాలజిస్టునవుతానని పేర్కొంది.

దొండపూడి విద్యార్థికి ఉత్తమ ప్రతిభ

రావికమతం: దొండపూడి గ్రామానికి చెందిన అడ్డూరి లీలా గణేష్ ఎంసెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి 861 ర్యాంక్ సాధించాడు. తల్లిదండ్రులు అడ్డూరి శ్రీను, సరోజిని సాధారణ రైతు కుటుంబానికి చెందిన వారు. లీలా గణేష్ దొండపూడి ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో 578 మార్కులు సాధించి మండలంలో రెండో స్థానంలో నిలిచాడు. జగనన్న ఆణిముత్యాలు అవార్డును నాటి ప్రభుత్వ విప్ ధర్మశ్రీ చేతుల మీదుగా అందుకున్నాడు. ఇటీవల విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆల్ ఇండియా ఓబీసీ కేటగిరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి 2,839 ర్యాంక్ సాధించాడు.

అయోమ‘యోగాంధ్ర’

యోగా మానసిక, శారీరక ఆరోగ్యానికి దివ్య ఔషధం... ఒత్తిడి నుంచి దూరం చేస్తుంది... కానీ అధికారులు, ఉద్యోగులు మాత్రం గత పక్షం రోజులుగా ‘యోగాంధ్ర’ ఒత్తిడితో నలిగిపోతున్నారు. ఒక పక్క శిక్షణ కార్యక్రమాలు... మరో పక్క ఫొటోలను అప్‌లోడ్ చేయడం...ఇంకో పక్క అభ్యర్థులను ఒప్పించే, టార్గెట్‌లను పూర్తిచేసే పనులు, సర్వేలు, టెలీకాన్ఫరెన్స్‌లు ఇలా తలకు మించిన పనులతో సతమతమవుతున్నారు. కింది స్థాయి నుంచి ఒకటే హైరానా పడుతున్నారు.... సాధ్యం కాని ఆసనాలతో పోటీలకు ఎలా సిద్ధం చేయాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు.

- తీవ్ర స్థాయిలో ఉద్యోగులపై పని ఒత్తిడి
- యోగాంధ్ర సర్వే, లక్ష్యాలు, టెలీకాన్ఫరెన్స్‌లతో తిప్పలు
- సాధ్యం కాని ఆసనాలతో పోటీ ఎలా అంటున్న ప్రజలు



కష్టమైన బద్ధ పద్మాసనం



పూర్ణ మత్స్యేంద్రాసనం



అతి కష్టతరమైన విభక్తి పశ్చిమోత్తాసనం

యలమంచిలి రూరల్: యోగాంధ్ర పేరిట ప్రభుత్వం చేస్తున్న హంగామా అధికారులు, ఉద్యోగులను అయోమయానికి, తీవ్ర అవస్థలకు గురిచేస్తోంది. రాష్ట్రంలో యోగాంధ్ర కార్యక్రమం అమలవుతున్న తీరు సుబ్బి పెళ్లి ఎంకి చావుకొచ్చిందన్నట్టుంది. నెల రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ప్రజలను భాగస్వాములను చేయాలని సచివాలయ ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. జిల్లాలో పురపాలక సంఘాలు, నగర పంచాయతీలతోపాటు సచివాలయాల పరిధిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఏ ఒక్కర్నీ వదలడం లేదు. కొద్ది రోజులుగా మిగతా విషయాలు పక్కన పెట్టి కేవలం యోగా మంత్రం జపిస్తున్నారు. దీంతో అధికారులు తీవ్రంగా నలిగిపోతున్నారు. యోగాంధ్ర యాప్ రిజిస్ట్రేషన్ల నుంచి గ్రామ, మండల స్థాయి పోటీల నిర్వహణ వరకూ ఎంపీడీవో, తహసీల్దార్ స్థాయి అధికారులకు టార్గెట్‌లు నిర్ణయించారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఈ లక్ష్యాలను ఎలా చేరుకోగలమంటూ అధికారులు మదనపడిపోతున్నారు. గ్రామ సెక్రటరీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, మండల స్థాయి అధికారులు, యోగాంధ్ర మాస్టర్ ట్రైనీలు ఇలా అందరిపైనా తీవ్ర పనిభారం, ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పటి వరకూ రిజిస్ట్రేషన్లు, యోగా ప్రొటోకాల్ ఆసనాల శిక్షణను అధికారులు నయానో, భయానో పూర్తి చేశారు.

ఇవేం పోటీలు

జిల్లా స్థాయిలో యోగా పోటీలకు సంబంధించి 10 నుంచి 18 సంవత్సరాలు, 19 నుంచి 35 సంవత్సరాలు, 35 ఏళ్లు పైబడి అంటూ మూడు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. వాస్తవానికి 50 ఏళ్లు పైబడిన కేటగిరీ ఇవ్వకపోవడంతో, యోగాలో అనుభవం, ఆసక్తి ఉన్న ఆ వయస్సు గ్రూపునకు చెందిన కొందరు 35 ఏళ్ల వయస్సున్న వారితో పోటీ పడే పరిస్థితి ఏర్పడిందని వారంతా పోటీల్లో పాల్గొనడానికి ఆసక్తి కనబర్చడం లేదు. నిరంతరం సాధన చేసే వారు, యోగా శిక్షణ కేంద్రాల్లో శిక్షణ పొందే వారు మాత్రమే వేయగల ఆసనాలను మాత్రమే పోటీల జాబితాలో పొందుపర్చడంతో ఆ జాబితాను చూసిన వారందరూ విస్మయం చెందుతున్నారు. ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నవారిని సైతం పోటీల్లో అభ్యర్థులుగా చేర్చడంతో.. క్లిష్టతరమైన ఆసనాలు వేయలేమని, తమ పేర్లను తొలగించాలని వారు కోరుతున్నారు. కానీ పోటీలో ఎక్కువమంది పాల్గొన్నట్టు చూపించేందుకు అధికారులు తంటాలు పడుతున్నారు. చిన్న పిల్లలకు ఆకర్ణ ధనురాసనం, బకాసనం, 19 నుంచి 35 సంవత్సరాల విభాగంలో మత్స్యేంద్రాసనం, జిల్లా స్థాయిలో విభక్త పశ్చిమోత్తాసనం వంటి ఆసనాలు వేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో పూర్ణ మత్స్యేంద్రాసనం, ఓంకారాసనం, కర్ణ పీడాసనం ఇచ్చారు. సచివాలయ ఉద్యోగులతోపాటు యోగా మాస్టర్ ట్రైనీలు, ఎంపీడీవోలు గ్రామాల్లోకి వెళ్లి పోటీల్లో పాల్గొనాల్సిందిగా అందరినీ ప్రాధేయపడవలసి వస్తోంది. మండల స్థాయి పోటీలను ఏదోలా మమ అన్పించినప్పటికీ జిల్లా స్థాయి పోటీలకు వెళ్లేవారిని పంపించడం కష్టతరమేనని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

సాధ్యం కాని ఆసనాలతో పోటీలు ఎలా ?

యోగాంధ్ర కార్యక్రమానికి మే 21 నుంచి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖ కేంద్రంగా ఐదు లక్షల మందితో నిర్వహించాలని నిర్ణయించారు. ప్రధాని మోదీ కూడా హాజరవుతుండడంతో ఎలాగైనా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో అధికారులు, ఉద్యోగులకు క్షణం తీరిక లేకుండా చేస్తోంది. యోగాంధ్ర ఎన్‌రోల్‌మెంట్, మాస్టర్ ట్రైనీల రిజిస్ట్రేషన్, యోగా ప్రొటోకాల్ ఆసనాలను పూర్తి చేసినప్పటికీ, జిల్లా స్థాయి యోగాసనాల పోటీల నిర్వహణ మాత్రం మా వల్ల కాదని చేతులెత్తేస్తున్నారు. ఎందుకంటే సాధ్యం కాని, అలవాటు లేని ఆసనాలతో పోటీలు నిర్వహించాలని అధికారులు మార్గదర్శకాల్లో పేర్కొనడంతో, కొత్తగా యోగా నేర్చుకున్న తాము ఈ ఆసనాలను ఎలా వేయగలమంటూ పోటీల్లో పాల్గొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు.

వెబ్‌తోనే టైం సరి

యోగాంధ్ర కార్యక్రమం కోసం ప్రతి రోజూ కలెక్టర్ నుంచి ఆయుష్ విభాగం అధికారులు, పలు శాఖల జిల్లా స్థాయి అధికారులు గూగుల్ మీట్, వెబెక్స్ నిర్వహిస్తుండడంతో గంటల కొద్దీ సమయం వృథా అవుతోందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు కిందిస్థాయి ఉద్యోగులను గ్రామాల్లో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై దృష్టి పెట్టాలంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని మూడు రోజులపాటు ఎటువంటి శ్రమ లేకుండా చేపట్టామని అధికారులు చెబుతుండడం గమనార్హం. అప్పటి ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. కానీ ఇపుడు యోగాంధ్ర కార్యక్రమం కోసం నెల రోజులపాటు నరకయాతన పడుతున్నామని అధికారులు తమ అంతర్గత సంభాషణల్లో తలలు పట్టుకుంటున్నారు. యోగాసనాలు నేలపై వేయకూడదు. మ్యాట్‌లు, లేదా కార్పెట్లు వంటివి ఉండాలి. కానీ యోగాంధ్ర కోసం అధికారుల మాట కాదనలేక కటిక నేలపై కూడా ఆసనాలు చేస్తున్న ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారు. యోగాంధ్ర కార్యాచరణతో చాలా పని ఒత్తిడితో సచివాలయం నుంచి మండల స్థాయి ఉద్యోగులంతా నరకం చూస్తున్నారు. చివరకు రోజూ కార్యాలయంలో రాత్రి 10 గంటల వరకూ కూడా పనిచేయాల్సిన దుస్థితి ఏర్పడిందని అధికారులు తీవ్రంగా మదనపడుతున్నారు.



యలమంచిలిలో యోగాంధ్ర సర్వే నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

సింహాచలం దేవస్థానం ఈవో బదిలీ



త్రినాథరావు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఈవో వి. త్రినాథరావును ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన్ని దేవదాయశాఖ రాజమహేంద్రవరం మల్టీ జోన్-1 రీజనల్ జాయింట్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి వి. వినయ్‌చంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే సింహాచలం దేవస్థానానికి కొత్త ఈవో నియమితులయ్యే వరకు త్రినాథరావే ఇన్‌చార్జి ఈవోగా కొనసాగాలని ఈ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. త్రినాథరావు 2024 సెప్టెంబర్ 22 నుంచి సింహాచలం దేవస్థానం ఈవోగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఏడాది మార్చి 1 నుంచి మే 31 వరకు వ్యక్తిగత కారణాలతో సెలవులో ఉన్న ఆయన, గత నెల 26వ తేదీనే తిరిగి విధుల్లో చేరారు. కాగా, తనను సింహాచలం దేవస్థానం నుంచి బదిలీ చేయాలని త్రినాథరావే దేవదాయశాఖకు దరఖాస్తు చేసుకున్నందువల్లే ఈ బదిలీ జరిగిందని ప్రచారం జరుగుతోంది.

డీపీవోగా సందీప్



సాక్షి, అనకాపల్లి: జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో)గా ఇ.సందీప్‌ను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్.శిరీష రాణి విజయనగరానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

బీసీ కార్పొరేషన్ ఈడీగా శ్రీదేవి

ఎంవీపీకాలనీ (విశాఖ): అనకాపల్లి జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీగా కె.శ్రీదేవి నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం విశాఖ జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విశాఖ జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీగా కె.శంకరరావు నియమితులయ్యారు. ప్రస్తుతం కృష్ణా జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను విశాఖ జిల్లా ఈడీగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సాక్షి కార్యాలయాలపై దాడులు సరికాదు

జిల్లా వ్యాప్తంగా పోలీసులకు జర్నలిస్టుల ఫిర్యాదు



కోటవురట్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు



యలమంచిలి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

సాక్షి, అనకాపల్లి: రాష్ట్రవ్యాప్తంగా సాక్షి కార్యాలయాలపై టీడీపీ దాడులకు పాల్పడడం సరికాదని జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. సాక్షి కార్యాలయాలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా వ్యాప్తంగా పాత్రికేయులు ఆయా పోలీసు స్టేషన్లలో సోమవారం ఫిర్యాదులు చేశారు. అనకాపల్లిలో సీఐ విజయకుమార్‌కు, పాయకరావుపేట పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ పురుషోత్తంకు స్థానిక పాత్రికేయులు సహా సాక్షి విలేకరులు ఫిర్యాదులు అందజేశారు. కోటవురట్ల పోలీసు స్టేషన్‌లో ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు ఎం.రాజు, డి.అప్పారావు ఫిర్యాదు చేశారు. యలమంచిలి, దేవరాపల్లి, గొలుగొండ, కె.కోటపాడు, నక్కపల్లి, మునగపాక, రోలుగుంట, రావికమతం, అచ్యుతాపురం స్టేషన్లలో కూడా తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు అందజేశారు. కొందరు వ్యక్తులు చేపట్టిన రాజకీయ ప్రేరేపిత దాడులు, ఇతర నేర చర్యలపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి, కఠినమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సాక్షి మీడియా విశాఖ యూనిట్ బ్రాంచ్ మేనేజర్ వఱ్ఱి చంద్రారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కార్యాలయం ఎదుట అనుమతి లేకుండా గుంపులుగా చేరి దాడులకు పాల్పడ్డారని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

• కొవ్వొత్తులతో సాక్షి సిబ్బంది నిరసన



సాక్షి కార్యాలయాలపై రాష్ట్రంలో పలుచోట్ల టీడీపీ శ్రేణులు పాల్పడిన దాడులకు నిరసనగా విశాఖపట్నంలో సాక్షి మీడియా సిబ్బంది కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. సోమవారం రాత్రి సాక్షి కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాక్షిలోని వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు. -సాక్షి, విశాఖపట్నం

ఉక్కు ఉద్యమంపై కుట్ర
- పోలీసుల తీరుపై ఉక్కు కార్మికుల ఆగ్రహం
8లో

రాజకీయ సిఫార్సులకే పెద్దపీట?

- ఉమ్మడి విశాఖలో బదిలీల దుమారం
- ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి నో బదిలీ
- పెందుర్తిలో బాబ్జికి భంగపాటు?



బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట: ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో జరిగిన రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల ఉద్యోగుల బదిలీలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఏళ్ల తరబడి ఒకే చోట పాతుకుపోయిన, ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు తహసీల్దార్లకు స్థానచలనం కల్పించకపోవడం, అదే సమయంలో కీలకమైన పోస్టులను భర్తీ చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ బదిలీల ప్రక్రియలో కూటమి ఎమ్మెల్యేల సిఫార్సులకే పెద్దపీట వేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా రెవెన్యూ శాఖలో జరిగిన తహసీల్దార్ల బదిలీలలో రాజకీయ జోక్యం స్పష్టంగా కనిపిస్తోంది. పెందుర్తి తహసీల్దార్ బదిలీ విషయంలో అక్కడి ఎమ్మెల్యే పంతం నెగ్గించుకున్నారు. ఈ విషయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ సిఫార్సులను పరిగణలోకి తీసుకోలేదని సమాచారం. భీమిలి ఎమ్మెల్యే సిఫార్సు మేరకే ఆనందపురం తహసీల్దార్‌ను బదిలీ చేసినట్లు తెలుస్తోంది. ఎక్కువ సంవత్సరాలు పనిచేసిన కారణంగా గాజువాక తహసీల్దార్ బదిలీ జరిగింది. అయితే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు అధికారులను కదపకపోవడం గమనార్హం. వీరితో పాటు డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందితో కలిపి రెవెన్యూ శాఖలో మొత్తం 62 మందిని బదిలీ చేశారు.

పంచాయతీరాజ్‌లో 75 మందికి స్థానచలనం

జిల్లా పరిషత్‌లో కూడా భారీగా బదిలీలు జరిగాయి. జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి మొత్తం 75 మంది ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఐదుగురు ఎంపీడీవోలు, ఐదుగురు పరిపాలనాధికారులు, 4 సీనియర్ అసిస్టెంట్లు, 11 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు టైపిస్టులు, 12 మంది రికార్డు అసిస్టెంట్లు, 30 మంది ఆఫీస్ సబార్డినేట్లు, ఆరుగురు నైట్ వాచ్‌మెన్ ఉన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర పాల్గొన్నారు.

బదిలీ అయిన రెవెన్యూ అధికారులు వీరే..


మండలం/స్థానం	తహసీల్దార్/ సూపరింటెండెంట్ పేరు	కేటాయించిన స్థానం
పెందుర్తి	ఎం.ఆనందకుమార్	అనకాపల్లి జిల్లా
ములగాడ	ఎం.భుజంగరావు	అనకాపల్లి జిల్లా
కలెక్టరేట్(అల్లూరి)	బి.నాగరాజు	అనకాపల్లి జిల్లా
కలెక్టరేట్(అల్లూరి)	సీహెచ్ తిరుమలరావు	అనకాపల్లి జిల్లా
కలెక్టరేట్(అల్లూరి)	ఎం.భాస్కరఅప్పారావు	అనకాపల్లి జిల్లా
అల్లూరి జిల్లా	టి.రామకృష్ణ	పెందుర్తి మండలం
అల్లూరి జిల్లా	ఎంవీవీఎసాద్	ల్యాండ్ ప్రొటెక్షన్(విశాఖ)
కలెక్టరేట్(అనకాపల్లి)	బీవీ రాణి	మెజిస్టీరియల్ సెక్షన్(విశాఖ)
అచ్యుతాపురం	జి.జనార్దన్	అల్లూరి జిల్లా
ఆనందపురం	పి.శ్యాంప్రసాద్	కోఆర్డినేషన్ సెక్షన్(విశాఖ)
(ఆనందపురం హెచ్‌డీటీ ఎల్.చేతన్ కుమార్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియామకం)		
గాజువాక	టి.శ్రీ వల్లి	వీఎంఆర్డీఏ
(గాజువాక హెచ్‌డీటీ బి.శ్రీనివాసరావు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియామకం)		
సీతమ్మధార	ఎం.రమేష్‌ను	ములగాడ
(సీతమ్మధార హెచ్‌డీటీ ఎస్.ఎ.త్రినాథరావు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియామకం)		

విద్యార్థులే దేశానికి పట్టుకొమ్మలు



ఉత్తమ విద్యార్థులకు అవార్డులు అందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ విజయ కృష్ణన్

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర
- 185 మంది విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానం



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

అనకాపల్లి టౌన్: విద్యార్థులే దేశానికి పట్టుకొమ్మలని, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, భూగర్భ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ ఏడాది పది, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులకు అనకాపల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం షైనింగ్ స్టార్స్ అవార్డులు ప్రదానం చేశారు. 10వ తరగతిలో 153 మంది, ఇంటర్‌లో 32 మంది అవార్డులు అందుకున్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20 వేలు చెక్, ప్రోత్సాహక సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తున్నామన్నారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ ఈ షైనింగ్ స్టార్స్ ఇక్కడితో ఆగకుండా రాబోయే రోజుల్లో మంచి విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి 25 అర్జీలు



అర్జీదారుల సమస్యలు వింటున్న జిల్లా అదనపు ఎస్పీ మోహనరావు

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదికకు 25 అర్జీలు వచ్చాయి. జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు ప్రజల సమస్యలు వింటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసపూరిత హామీలు వంటి వాటిపై అర్జీలు వచ్చాయన్నారు. చట్టపరిధిలో సమస్యలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీ డి.వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ-1 అధికారిగా మనోజ్‌కుమార్

అనకాపల్లి: మునగపాక, అనకాపల్లి, కశింకోట కార్మిక శాఖ-1 అధికారిగా మనోజ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విశాఖ కార్మిక శాఖ కార్యాలయం నుంచి సాధారణ బదిలీలో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన బాలకృష్ణ యలమంచిలి కార్మిక శాఖకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ మూడు మండలాల పరిధిలో కార్మికుల సమస్యలు పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

బయో డైవర్సిటీ పార్కులో శ్రీగంధం చెట్ల నరికివేత



నరికేసిన శ్రీగంధం చెట్లు

బీచ్‌రోడ్డు: పెద వాల్తేరులోని బయో డైవర్సిటీ పార్కులో 23 ఏళ్ల వయసున్న మూడు శ్రీగంధం చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికేశారు. పార్కు కంచెను తొలగించి, ఆరు నుంచి ఏడు అడుగుల పొడవైన కలప దుంగలను దొంగిలించారు. పార్కు నిర్వాహకుడు రామమూర్తి సోమవారం ఉదయం చెట్లు నరికివేయడాన్ని గుర్తించారు. వెంటనే మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది కేవలం గంధపు చెట్ల దొంగతనం కాదని, పార్కును నాశనం చేయడానికి చేసిన ప్రయత్నంగా కనిపిస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

మళ్లీ.. మళ్లీ కలెక్టరేట్‌కే..

- సమస్య పరిష్కారం కాక.. వస్తున్న అర్జీదారులు
- మండల అధికారుల నిర్లక్ష్య ధోరణిపై ఆవేదన
- కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌లో 240 అర్జీల నమోదు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, డీఆర్వో సత్యనారాయణరావు

తుమ్మపాల: పొంతన లేని సమాధానాలతో పీజీఆర్‌ఎస్ అర్జీదారులను అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం కాళ్లరిగేలా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదంటూ అర్జీదారులు వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యానికి గురై ఏర్పడిన సమస్యలపై కలెక్టరేట్‌లో మొరపెట్టుకుంటే జిల్లా అధికారులు సైతం అదే ధోరణి చూపిస్తున్నారంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థపై క్రమేపి ప్రజల్లో నిరాశ వ్యక్తమవుతోంది. పీజీఆర్‌ఎస్ ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు అధికారులు ఎండార్స్‌మెంట్లు ఇస్తూ వారిని దారుణంగా మోసం చేస్తున్నారు. దీంతో రెవెన్యూ సంబంధిత భూ సమస్యలు తప్ప ఇతర సంక్షేమ పథకాలు, వ్యక్తిగత అవసరాలకు సంబంధించి వాటిపై విన్నవించేందుకు ప్రజలు ముందుకు రావడం లేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వీరి సంఖ్య క్రమేపి తగ్గుతూ వస్తోంది. ఈ సోమవారం పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో 122 అర్జీలు రెవెన్యూ సంబంధిత అంశాలివే వచ్చాయి. పంచాయతీ రాజ్ - 32, సర్వే శాఖ -18, పోలీస్ -17, మరో 17 శాఖల్లో ఒకటి, రెండేసి అర్జీలు మాత్రమే నమోదయ్యాయి. మొత్తం 240 అర్జీలు రాగా, అధిక సంఖ్యలో ఫిర్యాదులు పునరావృతమైనవే ఉన్నాయి.

- కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారుల వద్ద కలెక్టర్ విజయకృష్ణన్‌తోపాటు డీఆర్వో వై.సత్యనారాయణరావు, ఎస్‌డీసీలు సుబ్బలక్ష్మి, మనోరమ అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదులపై సత్వరమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

మెట్టింట్లో కూతురు ఉద్యోగం చేస్తే పింఛన్ రాదంట!



వృద్ధాప్యంతో ఒంటరిగా జీవిస్తున్న తనకు ప్రభుత్వ పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ పట్టణంలోని గవరపాలెం అంబేడ్కర్ నగర్‌కు చెందిన జల్లూరి గౌంతమ్మ పీజీఆర్‌ఎస్‌లో అర్జీ పెట్టుకుంది. పట్టణంలో 23వ గ్రామ సచివాలయానికి పలుమార్లు తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయింది. పింఛన్ ఇస్తామంటూ ఇన్నాళ్లు తిప్పించుకుని, వివాహమైన కూతురు పేరు రేషన్ కార్డులో ఉందని, ఆమె ఉద్యోగం చేస్తున్నందున పింఛన్ రాదని ఇప్పుడు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఒంటరిగా జీవిస్తున్న తనకు వివాహమై వెళ్లిపోయిన కూతురు వివరాలు జోడించి అన్యాయం చేయొద్దని, కలెక్టరమ్మ స్పందించి పింఛన్ మంజూరు చేయాలని ఆమె వేడుకుంది.

పాసుపుస్తకాలు మంజూరు చేయలేదు



డీ-పట్టా భూమిని ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ పాయకరావుపేట మండలం కుమారపురం గ్రామానికి చెందిన గురుబిల్లి రాంబాబు అర్జీ చేసుకున్నాడు. తన అత్తగారైన కర్రి లక్ష్మి ద్వారా సంక్రమించిన డీపట్టా భూమి నేటికీ ఆన్‌లైన్ కాకపోవడంతో ప్రభుత్వ పథకాలు, సహాయం పొందలేక పోతున్నానని మొరపెట్టుకున్నాడు. వృద్ధాప్యంతో ఉన్న తనకు పాసుపుస్తకాలు మంజూరు చేసి న్యాయం చేయాలని కోరాడు.

ఉక్కు ఉద్యమంపై కుట్ర

- పోలీసుల ద్వారా కూటమి ప్రభుత్వం వేధింపులు
- దీక్షా శిబిరాన్ని ఆక్రమించిన పోలీసులు
- నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేసిన ఆందోళనకారులు
- పోలీసుల తీరుపై ఉక్కు కార్మికుల ఆగ్రహం



కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కూర్మన్నపాలెం వద్ద కొనసాగుతున్న దీక్షా శిబిరం వద్ద సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. శాంతియుతంగా జరుగుతున్న ఉద్యమాలను పోలీసుల ద్వారా అణచివేయాలని ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని కార్మిక సంఘాలు తీవ్రంగా మండిపడ్డాయి. 1,579 రోజులుగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో దీక్ష కొనసాగుతుండగా సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమానికి అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. అంతేకాకుండా దీక్షా శిబిరంలోకి పోలీసులు చొరబడి కుర్చీలలో ఆసీనులవడంతో ఆగ్రహించిన కార్మికులు నేలపై కూర్చుని నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా పోలీసులు దౌర్జన్యం ఆపాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశత్వం విడనాడాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

కార్మిక సంఘాల నేతల ధ్వజం

అఖిల పక్ష కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ ప్రభుత్వాలు అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు. శాంతియుతంగా జరుగుతున్న దీక్షలను పోలీసుల ద్వారా అణచివేయాలని చూడటం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉందని కారణం చూపి తొలగించడాన్ని యాజమాన్యం అక్షేపించడాన్ని తప్పుబట్టారు. కర్మాగారం స్థాపించినప్పటి నుంచి అనేక పోరాటాలు చేశామని, ఇంత దారుణంగా ఎవరూ ఎప్పుడూ వ్యవహరించలేదని పోరాట కమిటీ చైర్మన్ డి. ఆదినారాయణ ఆరోపించారు. మునుపెన్నడూ లేని విధంగా దీక్షా శిబిరాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడం ఇదే ప్రథమమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి విధానాలు విడనాడకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు.

సిట్ గౌరవ అధ్యక్షులు జె. అయోధ్యరామ్ మాట్లాడుతూ, కార్మికులను అణచివేసి కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేయాలని ప్రభుత్వాలు చూస్తున్నాయని మండిపడ్డారు. ఇది పాలకులకు క్షేమకరం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. 78వ వార్డు కార్పొరేటర్ బి. గంగారావు మాట్లాడుతూ, కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేయాలన్న కుట్ర ప్రభుత్వ విధానాల్లో భాగమేనని, కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లో భాగంగానే కార్మికుల ఉద్యమాలను అణచివేస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి నిర్ణయాలు ఉపసంహరించుకొని తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని గంగారావు హెచ్చరించారు. భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, కేఎం.శ్రీనివాస్, రామచంద్రరావు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సొంత గనులు కేటాయించాలి



స్టీల్ ప్లాంట్ 100 వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా కేంద్ర నిర్ణయాన్ని ఉపసంహరించుకోలేదు. ఆ ప్రక్రియలు మరింత వేగవంత చేస్తోంది. ఇది స్టీల్ ప్లాంట్‌కు నష్టం కనుక ఉద్యమాన్ని కొనసాగిస్తున్నాం. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించటం ద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గి సరసమైన ధరలకు స్టీల్ ప్రజలకు అందుతుంది. ప్రధానంగా యాజమాన్యం వైఖరి మార్చుకొని కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలి.

–జె.అయోధ్యరామ్, స్టీల్‌సీఐటీయు గౌరవ అధ్యక్షులు

కేంద్రంపై కూటమి ప్రభుత్వం ఒత్తిడి తేవాలి



ఎంతో అనుభవం నైపుణ్యముండే కార్మికులను తొలగించడం అన్యాయం. దీని వల్ల స్టీల్ ఉత్పత్తికి తీవ్రమైన అంతరాయం కలుగుతుంది. తొలగించిన కార్మికుల స్థానంలో కొత్తవారిని నియమించటం సరికాదు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇటువంటి అమానుష చర్యలు మానుకోవాలి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ కూడా కేంద్రపై ఒత్తిడి తేవాలి.

–నమ్మి రమణ, ప్రధాన కార్యదర్శి స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్

పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: సౌత్ వెస్ట్రన్ రైల్వే పరిధిలోని యశ్వంత్‌పూర్ జంక్షన్ స్టేషన్‌లో భద్రతా పరమైన ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా ఆ మార్గంలో ప్రయాణించే కొన్ని రైళ్ల గమ్యస్థానాలను కుదించినట్లు వాల్తేరు డివిజన్ రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 11, 18, 25వ తేదీల్లో హౌరా-యశ్వంత్‌పూర్(22831) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ యల్లహంక స్టేషన్ వరకు మాత్రమే నడుస్తుంది. 13, 20, 27వ తేదీల్లో యశ్వంత్‌పూర్-హౌరా(22832)సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ యల్లహంకం నుంచి బయలుదేరుతుంది. ఈ తేదీల్లో ఈ రైళ్లు యశ్వంత్‌పూర్-యల్లహంక స్టేషన్ల మధ్య రాకపోకలు సాగించవు.

ఢిల్లీ సందర్శించిన నలుగురు విద్యార్థులు

- రిషిహుడ్ విశ్వవిద్యాలయంలో పర్సనాలిటీ డెవలప్‌మెంటుపై శిక్షణ



సృజనవాణి సంస్థ ద్వారా ఢిల్లీ వెళ్లిన విద్యార్థులు

మాడుగుల రూరల్: సృజనవాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలో వీరవల్లి అగ్రహారం విద్యార్థులు ఢిల్లీ సందర్శించారు. అక్కడ సమీపంలో రిషిహుడ్ విశ్వవిద్యాలయంలో పర్సనాలిటీ డెవలప్‌మెంటుపై శిక్షణ తీసుకున్నారు. షైన్ ఇన్ ది స్కై సూపర్ 60 రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులు కె. కల్పన(చోడవరం), ఎం. రోహిత్‌కుమార్ (వీరనారాయణం), కె.మోహిత, ఎం. గౌతమి(కె.జె.పురం) ఎంపిక చేశారు. ఈ నెల ఒకటో తేదీన ఇక్కడ నుంచి ఢిల్లీకి రైల్లో వెళ్లారు. ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు కమ్యూనికేషన్, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపుదల వంటి అంశాల్లో శిక్షణ పొందారు. ఇందులో భాగంగా అక్షరధామ, లోటస్‌పాండ్, ఢిల్లీ గేట్, పార్లమెంటు భవనంతో పాటు పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. అక్కడ నుంచి నేరుగా విమానంలో విశాఖకు సోమవారం తిరిగి వచ్చారు. వీరి వెంట సృజనవాణి స్వచ్ఛంద సంస్థ కార్యనిర్వాహక సభ్యుడు పి. మహేశ్ వెళ్లారని సంస్థ సమన్వయకర్త జానీ సోమవారం తెలిపారు.

వాటర్ ప్లాంట్ నిర్వహణలో కక్షసాధింపు

- వైఎస్సార్‌సీపీ నాయకుడు బుజ్జి తొలగింపు



కమిషనర్ సురేంద్రకు వినతిపత్రం అందజేస్తున్న వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, బుజ్జి

నర్సీపట్నం: ఎన్టీఆర్ సుజల స్రవంతి నిర్వహణ నుంచి వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి బుజ్జిని రాజకీయ కక్షసాధింపుతో తప్పించడం సరికాదని మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, కౌన్సిలర్లు సిరసపల్లి నాని, మాకిరెడ్డి బుల్లిదొర, కోఆప్షన్ సభ్యుడు ఎండీ బాషా, పార్టీ నాయకులు చీటిల రాము, యాదగిరి శేషు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సురేంద్రకు సోమవారం వారు వినతిపత్రం అందజేశారు. 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కాపు వీధిలో ప్రారంభించిన ఈ ప్లాంట్‌ను నాటి నుంచి నేటి వరకు బుజ్జి తన సొంత నిధులతో నిర్వహిస్తూ ప్రజలకు సజావుగా నీటిని సరఫరా చేస్తున్నారన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదు లేకపోయినా టీడీపీ నాయకులు ఒత్తిడి మేరకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ప్లాంట్ నిర్వహణ బాధ్యతల నుంచి తొలగించటం సమంజసం కాదన్నారు. ప్లాంట్ నిర్వహణకు అవసరమైన ఎక్యూప్‌మెంట్‌కు రూ.2 లక్షలకు పైగా వెచ్చించారన్నారు. కనీసం ఆ నిధులైన ఇవ్వాలని వినతిపత్రంలో డిమాండ్ చేశారు.

భర్తపై నూనెతో దాడి చేసిన భార్య అరెస్ట్

పరవాడ: సాలాపువానిపాలెంలో గత నెల 22న భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణలో భర్తపై మరిగిన నూనెతో దాడి చేసిన కేసులో నిందితురాలు నక్క రమణమ్మను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. ఈ దాడిలో గండికోట బాలకృష్ణ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు సోమవారం ఈ వివరాలు వెల్లడించారు. సాలాపువానిపాలెంలో నివాసం ఉంటున్న గండికోట బాలకృష్ణ, నక్క రమణమ్మ దంపతుల మధ్య గత నెల 22వ తేదీ రాత్రి ఘర్షణ జరిగింది. తెల్లవారుజాము 3 గంటల సమయంలో రమణమ్మ.. నిద్రపోతున్న బాలకృష్ణ ముఖంపై మరిగించిన వేడి నూనెను పోసి అక్కడి నుంచి పరారైంది. ఈ ఘటనలో బాలకృష్ణ ముఖం, కళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానికులు అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితురాలు అనకాపల్లిలోని పూడిమడక రోడ్డులో సంచరిస్తున్నట్లు సమాచారం అందుకున్నారు. ఎస్‌ఐ వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా.. రమణమ్మ గతంలో బాలకృష్ణపై యాసిడ్‌తో దాడి చేసింది. శ్రీకాకుళం జిల్లా బూర్జ పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు పెండింగ్‌లో ఉన్నట్లు సీఐ తెలిపారు. అలాగే గాయపడిన బాలకృష్ణపైనా దొంగతనాలకు సంబంధించిన పలు కేసులు నమోదై ఉన్నాయని సీఐ వెల్లడించారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి వ్యక్తులకు ఇళ్లను అద్దెకు ఇచ్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సీఐ సూచించారు.

ఆడ పిల్లలకు రక్షణ కరువు



వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు

నర్సీపట్నం: కూటమి పాలనలో విద్యార్థినులైన ఆడ బిడ్డలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నర్సీపట్నం నియోజకవర్గం అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు విమర్శించారు. రాష్ట్రంలో చదువుకునే విద్యార్థినులు, మహిళలకు రక్షణ కరువైందన్నారు. అనంతపురం జిల్లాలో ఇంటర్మీడియట్ చదువుతున్న గిరిజన విద్యార్థిని దారుణ హత్యకు గురైందన్నారు. నిన్న విశాఖ జిల్లా భీమిలిలో ఒక బాలికపై అత్యాచార ఘటన వెలుగులోకి వచ్చిందన్నారు. ఇవన్నీ కూటమి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. చిన్నారులు, విద్యార్థులు, మహిళలపై అత్యాచారాలు, దాడులు, హత్యలు నిత్యకృత్యంగా మారాయన్నారు. మంత్రి లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుపై ఉన్న శ్రద్ధ విద్యార్థినులు, మహిళల రక్షణపై లేదని విమర్శించారు. ఆడబిడ్డలపై ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నిస్తానని ఎన్నికల ముందు గొప్పలు చెప్పిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. అనంతపురంలో దారుణ హత్యకు కారణకులైన వానిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దారుణాలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాణి బాధ్యతల స్వీకరణ



మహారాణిపేట: కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా ప్రసూతి, స్త్రీ వ్యాధుల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఐ.వాణి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సూపరింటెండెంట్ పోస్టు అదనపు డీఎంఈ కేడర్‌లో ఉండటంతో.. అదే కేడర్‌కు చెందిన డాక్టర్ వాణిని నియమిస్తూ వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇప్పటివరకు ఆ పదవిలో ఉన్న డాక్టర్ పి.శివానంద్ నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. సీఎస్ఆర్‌ఎంవో డాక్టర్ యు.శ్రీహరి, అడ్మినిస్ట్రేటర్ బి.వి. రమణ, డిప్యూటీ సీఎస్ఆర్‌ఎంవో డాక్టర్ జి.మెహర్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ డి.రాధాకృష్ణన్, డాక్టర్ వి.రవి, డాక్టర్ ఎల్. లోకనాథ్ రావు, డాక్టర్ జి.వాసవి లత, అసిస్టెంట్ డైరెక్టర్ బి.ఎస్.సుమతితో పాటు ఇతర వైద్యులు, పరిపాలన సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డాక్టర్ వాణి మాట్లాడుతూ రోగులకు మెరుగైన సంరక్షణ, ఉన్నతమైన చికిత్స ప్రమాణాలు అందించడమే తన ప్రథమ లక్ష్యమని తెలిపారు. కేజీహెచ్ ప్రతిష్టను ఇనుమడింపజేసేందుకు, అవసరమైన సంస్కరణలు చేపట్టేందుకు ప్రతి ఒక్కరి సహకారం తీసుకుంటానన్నారు.

యోగ దినోత్సవం నిర్వహణకు పలువురు అధికారుల నియామకం

మహారాణిపేట: ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖలో విస్తృత ఏర్పాట్లు, సమన్వయం కోసం పలువురు సీనియర్ అధికారులను నియమించారు. ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాలకు కూడా ఇన్‌చార్జులను నియమించి, వారి ద్వారా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ బృందంలో 9 మంది ఐఏఎస్ అధికారులు, 31 మంది డిప్యూటీ కలెక్టర్లు, ఏడుగురు సివిల్ సప్లైస్ అధికారులు, 109 మంది తహసీల్దార్లు ఉన్నారు.

యోగా.. మంచిదేగా!

ఏయూక్యాంపస్: యోగాంధ్రలో భాగంగా ఎంజీఎం లాన్-1లో సోమవారం వీఎంఆర్డీఏ సిబ్బంది యోగాసనాలు సాధన చేశారు. మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్ విశ్వనాథన్ పాల్గొని.. నిత్య జీవితంలో యోగాను ఒక భాగంగా మార్చుకోవాలని సూచించారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. అనంతరం వీఎంఆర్డీఏకు చెందిన ఐదు వందల మంది సిబ్బంది యోగాసనాలు వేశారు. జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, పర్యవేక్షక ఇంజినీర్లు భవానీ శంకర్, బలరామ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉక్కపోతతో విలవిల



జన సంచారం లేక వెలవెలబోతున్న కశింకోట పంచాయతీ ప్రధాన రహదారి

కశింకోట: మండల ప్రజలు ఒక వైపు సూర్యతాపం, మరో వైపు వడగాల్పులు, ఉక్కపోతలతో సతమతమయ్యారు. సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతం నుంచి సాయంత్రం 4 గంటల ప్రాంతం వరకు వడగాలులు వీచాయి. దీంతో ప్రజలు అత్యధిక మంది ఇళ్లకే పరిమితమయ్యారు. బయటకు రావడానికి సాహసించలేదు. దీంతో కశింకోటలోని ప్రధాన రహదారులు, వీధులు జన సంచారం లేక వెలవెలబోయాయి. సాయంత్రం వాతావరణం కాస్త చల్లబడటంతో ప్రజలు తమ కార్యకలాపాల నిర్వహణకు ఉపక్రమించారు.

అదృశ్యమైన మహిళ ఆచూకీ లభ్యం



మహిళను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని చినముషిడివాడ శ్రమశక్తినగర్‌కు చెందిన మహిళ(60) ఆచూకీ లభ్యమైనట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. కాలనీకి చెందిన నర్సింగరావు అనే వ్యక్తి తన భార్య కనిపించడం లేదని ఆదివారం రాత్రి పోలీసులను ఆశ్రయించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు సుజాత నగర్ ప్రాంతంలో అర్ధరాత్రి ఆమెను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వారపు సంతలో పనస ధరలు తగ్గుదల



మాడుగుల వారపు సంతలో కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తున్న పనస రైతులు

మాడుగుల : మాడుగుల పట్టణంలో సోమ వారం జరిగిన వారపు సంతలో పనసపండ్లకు ధరలు పలకలేదని, గిరి రైతులు ఆవేదన చెందుతున్నారు. గతంలో పెద్దవి జత పనస పండ్లు రూ.100 పలికేవని, కానీ ప్రస్తుతం రూ.60 కూడా పలకలేదని, గిరి రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది విశాఖ మన్యంలో అధికంగా పనస పండ్లు దిగుబడి పెరగడంతో ధరలు తగ్గిపోతున్నాయని, దూరప్రాంతాల నుంచి వ్యాపారులు రాకపోవడంతో ధరలు పలకక ఎదురు చూస్తున్నామని గిరి రైతులు చెబుతున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 215 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,150	4,900
రెండో రకం	3,520	4,270
మూడో రకం	3,300	3,560

అనకాపల్లి సినిమాలు

రాజా	: భైరవం
సత్యనారాయణ స్క్రీన్-1	: గ్యాంబ్లర్స్
సత్యనారాయణ స్క్రీన్-2	: 007
పర్తిసాయి	:ఖలేజా
షిర్డీసాయి	: డ్రగ్ లైఫ్
వెంకటేశ్వర	:రాజావారు
శ్రీ సత్య	:శుభం
రామచంద్ర	: పాడేరు 12వ మైలు

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 49 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-15 యూనిట్లు, బీ పాజిటివ్-6, ఓ పాజిటివ్-23, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 368 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

నిరుపయోగంగా 'సంపద' కేంద్రాలు

- లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా
- పట్టించుకోని కూటమి పాలకులు



తుమ్మపాలలో ఆలనాపాలనా లేక ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

అనకాపల్లి టౌన్: చెత్త నుంచి సంపద సృష్టించి వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వినియోగపడుతుందని ఆశయంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. కూటమి అధికారంలోకి రాగానే వీటిపై అలసత్వం ప్రదర్శించింది. ఉపాధి హామీ పథకం నిధులు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి.

మండలంలోని 32 గ్రామ పంచాయతీలు పరిధిలోని అన్ని గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. ఇవి ఎక్కడా పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. ఈ కేంద్రాలను ప్రారంభించి అక్కడితో తమ పని అయిపోయిందనుకొని అధికారులు అటువైపు కనీసం కన్నెత్తి చూడడం లేదు. కేంద్రంలో మోటార్లకు సరైన రక్షణ లేకపోవడంతో అవి దొంగల పాలయ్యే ప్రమాదముంది. అనకాపల్లి మేజర్ పంచాయతీ తుమ్మపాలలో సంపద తయారీ కేంద్రం నిర్మించి వదిలేశారు.

మెట్టపాలెంలో సంపద కేంద్రం దరిదాపులకు వెళ్లడానికి కూడా వీలు లేకుండా పోయింది. కేంద్రం చుట్టూ తుప్పలు పేరుకుపోయాయి. పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించడంలేదు. దీంతో పల్లెల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతుంది. గ్రామాల్లో తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వడానికి రెండు డబ్బాలను ప్రజలకు అందజేసి చేతులు దులిపేసుకున్నారు. వాటిపై ప్రజలకు సరైన అవగాహన కల్పించలేదు.



మెట్టపాలెంలో తుప్పల్లో నిండి ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

చెత్తను సేకరించే రిక్షా బళ్లు లేవు

ఇళ్ల నుంచి సేకరించిన తడి చెత్త ద్వారా సంపద కేంద్రాల్లో వర్మీ ఎరువును తయారు చేయొచ్చు. ఉత్పత్తి చేసిన వర్మీ ఎరువును, పొడి చెత్తను బహిరంగ మార్కెట్ల విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుంది. కానీ సంపద కేంద్రాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు గ్రీన్ అంబాసిడర్లను నియమించలేదు. మండలంలోని ఏ గ్రామం చూసినా రోడ్ల మీదే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చాలా గ్రామాల్లో ఇంటింటి ద్వారా చెత్తను సేకరించే రిక్షా బళ్లు లేవు. కొన్ని గ్రామాల్లో అవి ఉన్నా మూలకు చేరాయి.

తడి చెత్త వల్ల ఉపయోగం..

ఆహార వ్యర్థాలు, కొబ్బరి చిప్పలు, పండ్లు, తదితర కుళ్లిపోయే స్వభావం ఉన్న వాటిని తడి చెత్తగా పేర్కొంటారు. కంపోస్ట్ లేదా వర్మీ కంపోస్ట్ ఎరువును చేసి వాటిని తిరిగి మొక్కలకు ఉపయోగించవచ్చు. కేజీ రూ.10 వరకు అమ్ముకోవచ్చు.

పొడి చెత్త వల్ల ఉపయోగం..

సీసం ముక్కలు, ప్లాస్టిక్, కాగితం, లోహం వంటి కృశించని వస్తువులను పొడి చెత్తగా పేర్కొంటారు. పొడి వ్యర్థాలను అమ్ముకోవచ్చు. వ్యర్థాల స్థితి, పరిమాణం బట్టి కేజీ రూ.10 నుంచి రూ.40 వరకు ఆదాయం సమకూరుతుంది. తడి, పొడి చెత్త ద్వారా పంచాయతీలు ఆదాయాన్ని పెంచుకొని గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చు. మొత్తం మీద తడి, పొడి చెత్త కేంద్రాలు సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటం , పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడంలో దోహదం చేస్తాయని చెప్పక తప్పదు.



సంపద తయారీ కేంద్రం పక్కనే ప్లాస్టిక్ వ్యర్థాలు



సంపద తయారీ కేంద్రంలో నిరుపయోగంగా మెషీన్

వినియోగంలోకి తీసుకువస్తాం..

నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఎప్పటికప్పుడు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్నాం.

– శిరీషారాణి, జిల్లా పంచాయతీ అధికారి

ఇంటర్ విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు



దుర్గా శశాంక్

మర్రిపాలెం: పరీక్ష ఫెయిల్ అయినందుకు మనస్థాపంతో ఓ ఇంటర్ విద్యార్థి ఇంట్లో నుండి వెళ్లిపోయిన ఘటన కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లికి చెందిన దుర్గా సాయి శశాంక్ (17) మర్రిపాలెంలో ఓ ప్రైవేట్ కాలేజీలోని హాస్టల్లో ఉంటూ ఇంటర్ చదుతున్నాడు. వేసవి సెలవుల నేపథ్యంలో జ్ఞానాపురంలో ఉంటున్న అతని అమ్మమ్మ ఇంట్లో ప్రస్తుతం ఉంటున్నాడు. ఇటీవల ఇంటర్ ఫలితాలు విడుదల కావడంతో సదరు విద్యార్థి ఫెయిల్ అయినట్టు తెలుసుకుని అమ్మమ్మతో బయటికి వెళ్తున్నట్టు చెప్పి వెళ్లిపోయాడు. అతను ఎంతకీ ఇంటికి చేరుకోకపోవడంతో శశాంక్ అమ్మమ్మ అనకాపల్లిలో ఉంటున్న అతని తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు అంతటా వెతికినా కుమారుడి జాడ తెలియరాలేదు. దీంతో కంచరపాలెం పోలీసులకు తండ్రి చిన్నబాబు ఫిర్యాదు చేశారు. సీఐ చంద్రశేఖర్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ అబద్ధం కేసు దర్యాప్తు చేపట్టారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

మతం మారిన ఉద్యోగులపై చర్యలకు డిమాండ్

అనకాపల్లి టౌన్: మత మార్పిడి చేసుకుని దళితుల హక్కులను క్రైస్తవులు కబ్జా చేస్తున్నారని హిందూ షెడ్యూల్ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బోని గణేష్ పేర్కొన్నారు. స్థానిక పూల్ బాగ్ రోడ్డులోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మత మార్పిడి చేసుకొని హిందువులుగానే కుల ధ్రువీకరణ పత్రాలు పొంది ఉద్యోగాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మైలపల్లి పోతురాజు, అంగులూరి ఈశ్వరరావు, గంగాధర్, మరియమ్మ, గెంజి రమణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాల కోసం ఉపాధి కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధి కార్మికులు

పరవాడ: ఉపాధి హామీ కార్మికుల వేతనాల బడ్జెట్‌ను వెంటనే విడుదల చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మడకపాలెంలో ఉపాధి పనుల ప్రదేశంలో సిటు ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఉపాధి కార్మికులకు 9 వారాల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయి వేతనాలను వెంటనే చెల్లించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పని ప్రదేశంలో తాగునీరు, మజ్జిగ వంటి సదుపాయలను కల్పించాలన్నారు. పార, తట్ట, గునపాంలకు డబ్బులతోపాటు, వేసవి అలవెన్స్‌గా 40 శాతం చెల్లించాలన్నారు. ఏడాదికి 200 రోజుల పని దినాలు, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులను వేధింపులకు గురిచేయడం మానుకోవాలన్నారు. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పరిహారం ఇచ్చి.. తోటలు తొలగించండి

కారిడార్ పనులు అడ్డుకున్న సాగుదారులు



రాజయ్యపేటలో ఏపీఐఐసీ అధికారులు, పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఆందోళనకారులు

నక్కపల్లి: పరిశ్రమల కోసం భూములు సేకరించే సందర్భంలో 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయకుండా తోటలను తొలగించి భూములు స్వాధీనం చేసుకుని పనులు ఎలా ప్రారంభిస్తారంటూ పలువురు సాగుదారులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రాజయ్యపేట సమీపంలో జరుగుతున్న కారిడార్ పనులను అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో భాగంగా రాజయ్యపేట సమీపంలో ఏర్పాటు చేస్తున్న బల్క్‌డ్రగ్ పార్క్ కోసం ఏపీఐఐసీ భూములు సేకరించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి మౌలిక సదుపాయాలు కల్పించే పనులు గత కొద్ది రోజులుగా జరుగుతున్నాయి. భూసేకరణలో రాజయ్యపేట, బోయపాడు పరిసర ప్రాంతాల్లో పేదలు సాగు చేసుకుంటున్న డీఫారం, ప్రభుత్వ భూములు ఉన్నాయి. 2013 భూసేకరణ చట్ట ప్రకారం కంపెనీల కోసం ఈ భూములు స్వాధీనం చేసుకున్న సమయంలో వాటిలో ఉన్న ఫలసాయానికి, భూములకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. గత రెండు రోజులుగా ఏపీఐఐసీ అధికారులు డీ ఫారం, సాగుదారులకు చెందిన భూముల్లో మామిడి, జీడి తోటలను తొలగిస్తున్నారు. వీటికి ఇంత వరకు పైసా కూడా నష్టపరిహారం ఇవ్వలేదు. పరిహారం ఇవ్వకుండా తోటలు తొలగించడంపై సాగుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. తోటల తొలగింపు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో అధికారులు పోలీసుల సాయంతో వారిని బెదించారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు ఎం. అప్పలరాజు, స్థానిక టీడీపీ నాయకుడు పిక్కి శ్రీను, తదితరులు వెళ్లి సాగుదారులతో కలసి పనులను అడ్డుకున్నారు. ఈ దశలో పోలీసులకు ఆందోళనకారులకు మధ్య వాగ్వాదం జరిగింది. సాగుదారులు మాట్లాడుతూ చాలా ఏళ్ల నుంచి ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో జీడి, మామిడి తోటలు పెంచి సాగు చేస్తున్నామన్నారు. సుప్రీంకోర్టు తీర్పు, 2013 భూసేకరణ చట్ట ప్రకారం ప్రభుత్వ భూముల్లో ఫలసాయానికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. పైసా పరిహారం చెల్లించకుండా తోటలు తొలగించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. అధికారులు మాత్రం తాము స్వాధీనం చేసుకుంటున్న భూములకు మాత్రమే పరిహారం చెల్లించాలని, ఫలసాయానికి పరిహారం చెల్లించాలని ఎక్కడా నిబంధనలు లేవన్నారు. ఈ విషయాన్ని మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

మిత్రుని కుటుంబానికి ఆపన్న హస్తం



మిత్రుని భార్య, పిల్లలకు నగదు అందిస్తున్న 2001 బ్యాచ్ విద్యార్థులు

కోటవురట్ల: మానవత్వం పరిమళించింది. స్నేహబంధం నేనున్నానంటూ ఆపన్న హస్తాన్ని అందించింది. తమకు స్నేహంలోని మాధుర్యాన్ని పంచి ఈ లోకాన్ని విడిచిన మిత్రుడిని పూర్వ విద్యార్థులు మరిచిపోలేదు. ఆ కుటుంబానికి మేమున్నామంటూ ఆత్మీయ హస్తాన్ని అందించారు. కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో 2001లో పదో తరగతి చదివిన కాకర ఏసురత్నం అనారోగ్య కారణాలతో కొద్ది రోజుల క్రితం మృతి చెందాడు. నిరుపేద అయిన ఏసురత్నం కుటుంబాన్ని ఆదుకునేందుకు అతనితో కలిసి చదువుకున్న గొల్లు గణేష్, పైల కొండబాబు, రెడ్డి రాంబాబు, గంటల రామకృష్ణ, యర్రా రాజు, మిగతా సహచర మిత్రులు ముందుకొచ్చారు. అందరూ కలిసి రూ.52 వేలు నగదును మృతుడు ఏసురత్నం భార్యా పిల్లలకు సోమవారం అందజేశారు.

ఆ నష్ట పరిహారం ఎస్సీ కాలనీకి చెందాలి



కాగిత వద్ద రోడ్డు పనులు అడ్డుకుని ధర్నా చేస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

నక్కపల్లి: మండలంలో కాగిత నుంచి రాజయ్యపేట వరకు బల్క్ డ్రగ్‌పార్క్ కోసం తలపెట్టిన రోడ్డు నిర్మాణంలో ఎస్సీ కాలనీకి చెందిన బావిని కప్పేశారని, దీనికి సంబంధించిన పరిహారం ఎస్సీ కాలనీకే చెందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు దళితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. కాగిత నుంచి బల్క్‌డ్రగ్ పార్క్ వరకు ఏపీఐఐసీ 80 అడుగుల రోడ్డు నిర్మిస్తుంది. ఈ రోడ్డులో ఎస్సీ కాలనీకి సమీపంలో మంచినీటి బావి ఉంది. దీన్ని కప్పేసి రోడ్డు నిర్మాణం చేపట్టారు. మూడు సెంట్ల స్థలాన్ని చాలా సంవత్సరాల క్రితం ఎస్సీ కాలనీకి సమకూర్చడంతో కాలనీ వాసుల అవసరాల కోసం మంచినీటి బావిని నిర్మించి తాగునీటి కోసం ఉపయోగిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నాయకుడు అనపర్తి పాండు, తదితరులు తెలిపారు. అయితే ఇటీవల రోడ్డు నిర్మాణంలో భాగంగా సేకరించిన భూములు, బావులకు ప్రభుత్వం వారు నష్టపరిహారం చెల్లించారని, ఎస్సీ కాలనీలో ఉన్న బావికి నష్టపరిహారాన్ని గతంలో భూమిని దానంగా ఇచ్చిన రైతులకు చెల్లించారని వారు ఆరోపించారు. కాలనీకి చెందిన దళితులంతా పనులు అడ్డుకుని ధర్నా నిర్వహించారు. సుమారు 50 ఏళ్ల క్రితమే కాలనీకి ఉచితంగా ఇచ్చిన భూమికి ఇప్పుడు నష్టపరిహారం తీసుకోవడం దారుణమన్నారు. నష్ట పరిహారం కాలనీకి దక్కేలా చర్యలు తీసుకుంటే ఈ నిధులతో ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్లు చేసుకుంటామని, ఏపీఐఐసీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు.

రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి



అనకాపల్లి ఎంపీ రమేష్‌కు వినతి అందజేస్తున్న పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులు

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌కు పలువురు బాధితులు వినతి అందజేశారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల రహదారిని 100 అడుగుల మేర విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో బాధితులకు ఇచ్చే పరిహారాన్ని నేరుగా అకౌంట్‌లో జమ చేసేలా చూడాలని బాధితులు కోరారు. గతంలో అధికారులు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. అభివృద్ధికి తామంతా సమ్మతమని, అయితే పరిహారం విషయంలో తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆయన రహదారి విస్తరణ బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. వినతి అందజేసిన వారిలో బొడ్డేడ రామచంద్రరావు, ఆడారి అచ్చియ్యనాయుడు, భీమరశెట్టి శ్రీనివాసరావు, అనంత్, కృష్ణ తదితరులు ఉన్నారు.

రోగులకు సక్రమంగా సేవలందించాలి

మాకవరపాలెం: రోగులకు సక్రమంగా సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి ఆదేశించారు. లచ్చన్నపాలెంలో సోమవారం నిర్వహించిన ఎఫ్‌డీపీ వైద్య శిబిరాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బూరుగుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి చరిష్మను ఆదేశించారు. అన్ని సబ్ సెంటర్ల పరిధిలో ఉన్న వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు విత్తనాలు అందిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక: రైతులు వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు సొంతం చేసుకోవచ్చని శాస్త్రవేత్త శ్రీహరిరావు తెలిపారు. మునగపాక, ఉమ్మలాడ గ్రామాల్లో సోమవారం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, అనకాపల్లి వ్యవసాయ శాఖ సంయుక్త నిర్వహణలో వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా రైతులకు రాయితీపై ఎంపీపీ జయలక్ష్మి, సర్పంచ్ దిమ్మల అప్పారావుతో కలిసి ఆయన వరి విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరి రావు మాట్లాడుతూ ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మోతాదుకు మించి ఎరువులను వాడితే అనర్థాలు తప్పవన్నారు. అధికారుల సలహాలు, సూచనలు మేర ఎరువులు వినియోగించాలన్నారు. ఎంపీపీ జయలక్ష్మి, శాస్త్రవేత్త గౌరీ, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు లక్ష్మీ ప్రవీణ, పద్మిని, ఏఈవో లక్ష్మి, టెక్కలి పరశురామ్, దాడి ముసిలినాయుడు, సూరిశెట్టి అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు




నిత్యకల్యాణంలో అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం , శేషవస్త్రాలను అందించారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం ఈ సేవని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడ వాహనంపై అధిష్టింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేష హారతులిచ్చారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఎన్‌సీసీ యువశక్తి క్యాంప్‌లో వనమహోత్సవం



వర్సిటీలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్స్

సబ్బవరం: భవిష్యత్ తరాల మనుగడ కోసం ప్రకృతి వనరులను మనమే కాపాడుకోవాలని ఎన్‌సీసీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్ణిమ్ ప్రభాత్ అన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా విశ్వవిద్యాలయం అవరణలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. స్వర్ణిమ్ ప్రభాత్ ఆధ్వర్యంలో గ్రీన్‌క్లైమేట్ ఎన్‌జీవో సహకారంతో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్ తన ప్రతి పుట్టిన రోజున ఓ మొక్కను నాటి, పెంచాలన్నారు. వర్సిటీ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి 468 మంది క్యాడెట్స్ కోసం 468 మొక్కలను అందించిన గ్రీన్‌క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నంను అభినందించారు. రత్నం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ హిత జీవితాన్ని అలవరచుకోవాలన్నారు. ఎన్‌సీసీ సుబేదార్ మేజర్ పైలా శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సుబేదార్ సుజన్ సింగ్, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.